# నిషేధిత చైనా మాంజా వినియోగంపై కఠిన చర్యలు

**-సిపి సాధన రష్మీపెరుమాళ్**

**సిద్దిపేట అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త:**

ప్రజల ప్రాణ రక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలకు కారణమవుతున్న చైనా మాంజా(నైలాన్ దారాలు) వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని సిపి సాధన రష్మీపెరుమాళ్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ చైనా మాంజా వినియోగం నిషేధించడం జరిగిందని వినియోగించిన అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చైనా మాంజా కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పక్షులు తీవ్రంగా గాయపడటంతోపాటు ప్రాణ నష్టం సంభవించిన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. జిల్లా ప్రజలు తమ పిల్లలను చైనా మాంజా వినియోగానికి దూరంగా ఉండేలా చూడాలన్నారు. నిబంధనలు పాటిస్తూ చైనా మాంజా వలన కలిగే ప్రమాదాల నుంచి ప్రాణ భద్రతకు సహకరించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా నిషేధిత చైనా మాంజా వినియోగిస్తే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

# 19 నుంచి సదర్న్ ఇండియా సైన్స్ ఫెయిర్

**రామచంద్రాపురం, జనవరి 10, ప్రభాతవార్త:**

దక్షిణభారత విజ్ఞానప్రదర్శన (సదర్న్ ఇండియా సైన్స్ ఫెయిర్)ను ఈనెల 19వ తారీఖునుంచి 23వ తేదీవరకు రామచంద్రాపురం మండల పరిధిలోని కొల్లూర్ క్యాంపస్‌లోని ది గౌడియం స్కూల్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఐఎస్ఎఫ్ కన్వీనర్ జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. ప్రదర్శనలు విజయవంతంగా ముగిసేందుకు ఎస్ఐఎస్ఎఫ్-2026 నిర్వహణకు సంబంధించి ఏర్పాటుచేసిన 22కమిటీల సమన్వయ సమావేశం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పోతిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించామన్నారు. డిఈఈఓ వెంకటేశ్వర్లు ఆయాకమిటీ కన్వీనర్లకు, సేవా కన్వీనర్లతో వ్యక్తిగతంగా చర్చించి అవసరమైన సూచనలు చేశారని జాకీర్ హుస్సేన్ వివరించారు.

# సిద్దిపేటజిల్లాను తొలగిస్తామని చెప్పలేదు

**-కరీంనగర్‌లోకి హుస్నాబాద్ సెగ్మెంట్**
**-హద్దుల మార్పులో ఎవరికీ నష్టం జరగనివ్వం**
**-రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖామంత్రి పొన్నం ప్రభాకర్**



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 10, ప్రభాతవార్త:**

ఎన్నికల సమయంలో ఈప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీమేరకు శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేస్తామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం అర్బన్ ఫారెస్ట్ పార్క్ శంకుస్థాపన చేసిన మంత్రి విలేకరులతో మాట్లాడారు.

అర్బన్‌ఫారెస్ట్‌కి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయాల్సి ఉందని, ఎన్నికలవల్ల ఆగిపోయిందన్నారు. హుస్నాబాద్ మండలంలోని జిల్లలగడ్డగ్రామంలో అర్బన్ ఫారెస్ట్‌కు శంకుస్థాపనచేయడం సంతోషంగా ఉందన్నారు. ఈపార్కులు హైదరాబాద్ లేదా పెద్ద పెద్ద మున్సిపాలిటీలకు వస్తాయని, అతిత్వరలోనే హుస్నాబాద్ అడవులకు వెళ్లాలని, హైదరాబాద్ ప్రజలు ఇక్కడ ఉన్న అందాలు చూడడానికి వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. చూసినవారు వెళ్లి ఇక్కడి గురించి చెబితేనే టూరిజం అభివృద్ధి చెందుతుందని, వచ్చే 2 సంవత్సరాల్లో ఈపార్కును పూర్తిచేస్తామన్నారు. ఈప్రాంత అభివృద్ధికోసం కేంద్రప్రభుత్వం నుండి నిధులువచ్చేలా ప్రతిపాదనలు పెడుతున్నామని, ఈప్రాంతానికి మంచి చరిత్ర ఉందని గుర్తుచేశారు. అడవిలో రాజుల చరిత్ర ఆనవాళ్లు ఇక్కడ ఉన్నాయని, హిస్టరీకల్చర్ అంతా ఫారెస్ట్‌లోనే దొరుకుతుందని వివరించారు. పేరు ఉన్న రాయికల్ వాటర్‌ఫాల్స్ ఈప్రాంతంలోనే ఉందని, చాలామంది జలపాతాలు చూడడానికి ఇక్కడికి వస్తారన్నారు.

అర్బన్ ఫారెస్ట్‌కి వాచ్ టవర్‌తో పాటు చిల్డ్రన్ ప్లే గేమ్స్ కూడా తీసుకొస్తున్నామని, దీంతో జిల్లలగడ్డ ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా హుస్నాబాద్ ప్రాంతాన్ని గత ప్రభుత్వం బలవంతంగా సిద్దిపేట జిల్లాలో కలిపారని, ఇది కరీంనగర్ జిల్లాలో ఉండాలని ప్రజల ఆకాంక్ష అని అన్నారు. ఈప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇప్పుడున్న ముఖ్యమంత్రి ఎన్నికలసమయంలో పిసిసి హోదాలో హుస్నాబాద్ అంబేద్కర్‌సర్కిల్‌లో హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలుపుతామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈప్రాంత శాసనసభ్యుడిగా ఈ అంశాన్ని ముఖ్యమంత్రిదృష్టికి తీసుకెళ్లామని, ఎప్పుడైనా సరిహద్దుల మార్పు, జిల్లాల సైంటిఫిక్ మెథడ్‌లో మార్పులుచేర్పులు జరిగితే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కరీంనగర్‌లో కలపడం తథ్యమన్నారు. హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలుతామని చెప్పాను తప్పితే, సిద్దిపేట జిల్లాను తొలగిస్తామని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం అని హద్దులమార్పువిషయంలో ఈప్రాంతానికి నష్టం జరగకుండా చూసుకుంటామన్నారు.

**అక్కన్నపేటలో...**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట గౌరవెల్లి ప్రాజెక్ట్ కుడికాలువ 16.5 కిలోమీటర్ల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ బైక్ నడుపుతూ గౌరవెల్లినుండి మల్లారంవరకు ప్రాజెక్ట్ కుడికాలువను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ప్రాజెక్ట్ ఈఈ రాములు అధికారులు, స్థానిక నాయకులు కాలువనిర్మాణం పూర్తయినప్పటికీ అక్కడక్కడ అడ్డంకులు ఉన్నాయి అని తెలిపారు. గ్రామాలకు కాలువలపై అవసరమైన బ్రిడ్జిల నిర్మాణాలను గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు.

కాలువలకు చేయాల్సిన మరమ్మతులు, తొలగించాల్సిన చెట్లపొదలపై అధికారులకు సూచనలు చేశారు. కాలువలు పూర్తయితే బీడుగా ఉన్న వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. గౌరవెల్లి ప్రాజెక్ట్‌కి సంబంధించి 2010,11లో నిర్మాణం అయిన కుడికాలువ హుస్నాబాద్ నియోజకవర్గంలో 16.5 కిలోమీటర్ల పొడవున స్థానిక నాయకులతో కలిసి రావడం జరిగిందని, గౌరవెల్లి ప్రాజెక్ట్ ఎడమకాలువ 15 కిలోమీటర్ల మేర కోహెడ, చిగురుమామిడి వరకు పూర్తయిందని, కెనాల్ మొత్తంలో అక్కడక్కడ రెండు చిన్న బ్రిడ్జిలు అడ్డంకులు ఉన్నాయని అవి నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. మొత్తం నియోజకవర్గంలో 1200ఎకరాల భూమిసేకరణ జరగాల్సి ఉండగా ఇందుకోసం 250కోట్ల నిధులు కావాల్సి ఉందని, ఇప్పటికే నిధుల విడుదలకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఇరిగేషన్‌మంత్రి సహకరిస్తున్నారన్నారన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హుస్నాబాద్‌కి వచ్చి నప్పుడు హామీ ఇచ్చారని, దీని తరువాత ప్రారంభ మైన రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టలను గత ప్రభుత్వం పూర్తిచేసుకుని ఈప్రాజెక్ట్‌కు ఆటంకాలు తెచ్చిపెట్టారన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే కాలువల ద్వారా 57వేల ఎకరాలు, గండిపల్లి ద్వారా 14వేల ఎకరాలు, ట్యాంక్స్ నింపితే 35వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తోటపల్లి నుండి అండర్ టన్నెల్ పూర్తవడంతోపాటు మేజర్ కాల్వలు కూడా పూర్తికాగా, డిస్ట్రిబ్యూటరీ కాలువలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి భూసేకరణ జరుగుతుందన్నారు. సాగునీరు వస్తే ఈప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, ప్రాజెక్ట్ ట్రయల్ రన్ జరిగినప్పటికీ కాలువలనుండి చుక్క నీరు రాలేదని, ఎంతమంది అడ్డంకులు సృష్టించినా, భూసేకరణ జరగగానే కాలువల నిర్మాణం వేగంగా పూర్తి చేస్తామన్నారు.

**అభివృద్ధి పనులను పర్యవేక్షించిన మంత్రి...**

హుస్నాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యవేక్షి ంచారు. పట్టణంలోని ఎల్లమ్మచెరువు, కొత్తచెరువు, పల్లెచెరువు అభివృద్ధి పనులు సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కట్ట సుందరీకరణ పనులు వేగవంతంచేయాలని వారిని ఆదేశించారు. అనంతరం హుస్నాబాద్ ప్రారంభంలో నిర్మిస్తున్న స్వాగత స్టాచ్యూ పనులు పరిశీలించి పలుసూచనలు చేశారు. జాతీయరహదారి డివైడర్ మధ్య జరుగుతున్న అభివృద్ధి పనులు ప్లాంటేషన్ కార్యక్రమాలను, ఇండోర్ స్టేడియంను పరిశీలించారు. స్టేడియంలో అన్నిక్రీడలు జరిగేలా అభివృద్ధిచేస్తామని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన జ్ఞానేశ్వర్



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు మొక్కను అందచేస్తున్న జ్ఞానేశ్వర్

**నాగల్‌గిద్ద, జనవరి 10, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన పర్యావరణ ప్రేమికుడు పాలడుగు జ్ఞానేశ్వర్ శనివారం మాజీ ఉప రాష్ట్రపతి, భారతీయ జనతా పార్టీ అగ్రనేత వెంకయ్య నాయుడును హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని మొక్కను అందచేశారు. పర్యావరణ పరిరక్షణకు జ్ఞానేశ్వర్ చేస్తున్న కృషిని వెంకయ్య నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

# సెంట్రల్ జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి



కందిలో సెంట్రన్ జైలును తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి సౌజన్య

**కంది, జనవరి 10, ప్రభాతవార్త:**

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి.సౌజన్య కందిలోని సెంట్రల్ జైలును ఆకస్మికంగా తనిఖీచేశారు. జైలులోని బేరక్‌లు, ఖైదీల గదులు, వంటగది, బాత్‌రూంలు, సరుకుల నిల్వగదులు, జైలు పరిసరాలను న్యాయమూర్తి సౌజన్య పరిశీలించారు. ఖైదీలతో న్యాయమూర్తి ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను, ఆరోగ్యసౌకర్యాలు, భోజననాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచించారు. ఖైదీలకు సమయానికి బెయిల్స్, ములాఖత్ సదుపాయాలు అందుతున్నాయా అని ఆరాతీశారు. ఖైదీల కేసుల పరిష్కారానికి ఉచిత న్యాయసేవలు అందించేందుకు, అవసరమైతే లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయవాదులను నియమిస్తామని, ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖైదీలకు సూచించారు. జైలులో నిర్వహిస్తున్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను న్యాయమూర్తి పరిశీలించారు. ఖైదీలకు అందచేసేందుకు సిద్ధపరిచిన వంటలను న్యాయమూర్తి రుచి చూసి పరిశీలించారు.

# జిల్లాలను రద్దుచేస్తే ప్రభుత్వం రద్దు అవుతుంది

**-రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం కార్యనిర్వాహణ మాజీ అధ్యక్షులు దేవి రవీందర్**



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న దేవి రవీందర్, బిఆర్ఎస్ నాయకులు

**గజ్వేల్, జనవరి 10, ప్రభాతవార్త:**

సిద్దిపేట జిల్లాపై కన్ను వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు అవుతుందని రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం కార్యనిర్వహణ మాజీ అధ్యక్షులు దేవి రవీందర్ హెచ్చరించారు. జిల్లాలను తగ్గిస్తామని మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ గతంలో ఉన్న జిల్లాలతో పాలనాపరంగా సమస్యలు వస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలను తగ్గిస్తామనడం మంచిపద్ధతి కాదన్నారు. సిద్దిపేట జిల్లాను రద్దుచేస్తే ఊరుకునేదిలేదని, జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లా దిక్కు చూస్తే సహించమని అన్నారు. పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లో ఉన్న మండలాలను కరీంనగర్‌లో కలుపుతామని గతంలో చెప్పారని, మొన్న జరిగిన అసెంబ్లీలో జిల్లాలను కుదిస్తాం, సిద్దిపేట, సిరిసిల్ల మీద ప్రత్యేకశ్రద్ధ పెడతామని చెప్పి పొంగులేటి మాట్లాడడం రాజ్యాంగవిరుద్ధమైన మాటలని మండిపడ్డారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనచేయాలని, లేనిపక్షంలో జిల్లాప్రజలను కలుపుకొని పార్టీలకతీతంగా జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, అల్వాల బాలేష్, బొగ్గుల చందు, పంబాల శివకుమార్, కళ్యాణ్ కార్ నర్సింగరావు, గొడుగు స్వామి, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, చేబర్తి సురేష్, గాలెంక శ్రీనివాస్, బైరం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు ప్రాజెక్టు మరమ్మతులకు నీటి తరలింపు

**-8 టిఎంసిల నీరు 2300క్యూసెక్కుల చొప్పున నిజాంసాగర్‌కు విడుదల**



సింగూరు ప్రాజెక్టు దృశ్యం

**పుల్‌కల్, జనవరి 10, ప్రభాతవార్త:**

సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల దృష్ట్యా ప్రాజెక్టులోని 16టిఎంసిలకు పైగా ఉన్న నీటిలో 8 టిఎంసిల నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రాజెక్టుకు దిగువన ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టుకు నిత్యం 2300క్యూసెక్కుల లెక్కన 8టిఎంసిల నీటిని 40రోజుల పాటు జలవిద్యుత్ ఉత్పత్తి గేట్‌ద్వారా విడుదలచేసేందుకు శనివారం శ్రీకారంచుట్టారు. వర్షాకాలం ప్రారంభానికి 3నెలల సమయం ఉండటంతో ప్రాజెక్టులోని సగం నీటిని విడుదల చేసి ప్రాజెక్టు ఆనకట్టకు మరమ్మతులుచేయనున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. నీటివిడుదల అయ్యాక మిగిలిపోయే 8టిఎంసిల నీటిని ప్రాజెక్టుకు ఇరువైపుల ఉన్న మిషన్ భగీరథ తాగునీటి పథకాలకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. రానున్న వేసవిని దృష్టిలోపెట్టుకుని నీటిపారుదలశాఖ అధికారులు గ్రామస్థాయిలో ఆర్‌డబ్లుఎస్, జలమండలి అధికారులను అప్రమత్తంచేసి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారించేలా చర్యలుతీసుకోవాలని సూచిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ శుక్రవారం హైద్రాబాద్‌లోని తన నివాసంలో జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు.

# 42శాతం రిజర్వేషన్‌లతోనే ఎన్నికలకు సై అనాలి

**-జిల్లా కలెక్టర్‌కు బిసిసంఘం నాయకుల వినతి**



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి, జనవరి 10, ప్రభాతవార్త:**

త్వరలో జరుగనున్న మున్సిపల్, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలను బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలకు సై అనాలని సంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, జెఎసి కన్వీనర్ పట్లోళ్ల మల్లికార్జున్‌పాటిల్, జిల్లా బిసి సంఘం జెఎసి చైర్మన్ ప్రభుగౌడ్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు బిసి సంక్షేమ సంఘం బాధ్యులతో కలసి వినతిపత్రం అందచేశారు.

ఈసందర్భంగా పి.ప్రభుగౌడ్, మల్లికార్జున్ పాటిల్‌లు మాట్లాడుతూ రానున్న ఎన్నికలు రాజకీయపార్టీల గుర్తులపై జరుగుతాయని, అందుకు బిసిలకు 42శాతం రిజర్వేషన్లుకు పెంచేవరకు ఎన్నికలు నిర్వహించరాదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని గుర్తుచేశారు. జనాభాలెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని సుప్రీంకోర్టు పలుమార్లు తీర్పు చెప్పినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 62 మార్లు ఢిల్లీకి వెళ్లినా, బిసిల గురించి ప్రధానమంత్రిని కలిసిన దాఖలాలు లేవని విచారం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బిసిసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేష్ యాదవ్, బిసి జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ గోకుల్ క్రిష్ణ, జెఎసి కో-కన్వీనర్ సుధాకర్‌గౌడ్, బాధ్యులు గొలేశ్వర్, సుదర్శన్ గౌడ్, శ్రీనివాస్, పాండురంగం, మఫి, రమేష్, మంజుల గౌడ్, మానస, శృతిగౌడ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలింపు... కేసు నమోదు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను చూపిస్తున్న పోలీసులు

**ధూళిమిట్ట, జనవరి 10, ప్రభాతవార్త:**

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ధూళిమిట్ట గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగునుండి ఇసుకనుతరలిస్తున్న మెదీని భూచిరెడ్డి, ఇసుకుల్లా లింగంలను పట్టుకుని కేసు నమోదుచేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎండి ఆసిఫ్ తెలిపారు. ఈసందర్భంగా ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మనస్తాపంతో యువతి ఆత్మహత్య

**నర్సాపూర్ రూరల్, జనవరి 10, ప్రభాతవార్త:**

అనారోగ్యంతో బాధపడుతున్న యువతి మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలపరిధి చిన్నచింతకుంట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇదేగ్రామానికి చెందిన రాములు గ్రామపంచాయతీ కార్మికునిగా పనిచేస్తున్నాడు. రాములుకు ముగ్గురు కుమార్తెలు కాగా, చిన్నకూతురైన దీపిక చిన్నప్పటి నుండే మూర్ఛవ్యాధితో బాధపడుతుండేది. కొన్ని సంవత్సరాల క్రితం పక్షవాతం రావడంతో కాలు కూడా పనిచేయలేపోవడంతోపాటు, రెండు సంవత్సరాల నుండి గొంతు సమస్య కూడా ఉండటంతో, ఏదైనా తినడానికి కూడా ఇబ్బందిపడేది. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండటంతో తనలో తనే మధనపడుతుండేదని కుటుంబసభ్యులు తెలిపారు. అనారోగ్యం కారణంగా మనస్తాపానికిగురై ఉదయం ఇంట్లో ఎవరులేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి రాములు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు.

# మంత్రి పొన్నంకు ఉద్యమాభివందనాలు

**-ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్**

**హుస్నాబాద్ టౌన్, జనవరి 10, ప్రభాతవార్త:**

2016లో అప్పటి టిఆర్ఎస్‌ప్రభుత్వం హుస్నాబాద్ ప్రాంతాన్ని సిద్దిపేట జిల్లాలో కలపడాన్ని నిరసిస్తూ హుస్నాబాద్‌లో అన్నిపార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు కులసంఘాలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడం జరిగిందని, అప్పుడు సుమారు 60 రోజులపాటు జరిగిన ఈ ఉద్యమంలో వివిధపార్టీలకు చెందినటువంటి ఐదుగురునాయకులు ఆమరణ నిరాహారదీక్షలుచేయడంవల్ల కొంతమందినాయకులపైన అక్రమ కేసులు, లాఠీదెబ్బలుకూడా పడ్డాయని, ఆ ఉద్యమంలోభాగంగా విద్యార్థిసంఘ నాయకులుగా హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్‌లోనే కొనసాగించాలని సిద్దిపేట వద్దురా కరీంనగర్ ముద్దురా.. అనేనినాదంతో విద్యార్థిలోకాన్నిసైతం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమంలో భాగస్వామ్యంచేశామని ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, జిల్లా ఉద్యమం తీవ్రతరం అయిన పరిస్థితుల్లో ఈ జిల్లాను ఎట్టకేలకు సిద్దిపేటలోని కొనసాగిస్తారనే విషయమై భావోద్వేగానికిగురైన విద్యార్థిసంఘ నాయకులుగా ఉన్న తోటినాయకులు రాగి శ్రీనివాస్, గుగులోతు రవీంద్రనాయక్‌లతో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆ నిర్ణయాన్ని వెనకకు తీసుకునేవరకు మేము దిగబోము అవసరమైతే మా ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధమని నినదించినందుకు అప్పటి పోలీసు అధికారులు తమపై కేసు పెట్టగా ఎనిమిది సంవత్సరాల పాటు కోర్టు మెట్లు మెట్లు ఎక్కామన్నారు. ఇందుకు సంబందించిన కేసు 2024లో కొట్టుకుపోయిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్ జిల్లాలో తిరిగి కలుపుతామని హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడం సంతోషాన్ని కలిగిస్తుందని వారికి ఈప్రాంత ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలని జేరిపోతుల జనార్ధన్ తెలిపారు.

# గొల్లభామ చీరెలు జిల్లాకు ఒక బ్రాండ్

**-గొల్లభామ చీరెలకు అంతర్జాతీయ ఖ్యాతి**
**-కలెక్టర్ హైమావతి**



గొల్లభామ చీరెను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట రూరల్, జనవరి 10, ప్రభాతవార్త:**

జిల్లాలో తయారైన గొల్లభామ చీరెల వలన జిల్లాకు మంచి గుర్తింపు లభించిందని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. సిద్దిపేట పట్టణంలోని తుమ్మ లక్ష్మణ్ గృహంలో గొల్లభామ చీరెలను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వివిధ రంగులలో ఉన్న చీరెలను చూసి మంత్రముగ్ధులయ్యారు. మహిళలు చూడగానే ఆకట్టుకునేలా చీరెలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన గొల్లభామ చీరెలు జిల్లాకు ఒక బ్రాండ్ అని తెలిపారు. గొల్లభామ చీరెల గురించి ప్రతి మహిళలకు చేరేలా ప్రమోట్ చేసే బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. గొల్లభామ చీరెల చరిత్ర, నేసే విధానం ఇతరత్రా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్బర్‌పేట-భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్ తనిఖీ చేశారు. రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు.

# కొల్లూరులో భూవివాదం

**-పోలీసుల అదుపులో కొందరు**



గుర్తు తెలియని దుండగులు రేకులను తొలగించిన దృశ్యం

**రామచంద్రాపురం, జనవరి 10, ప్రభాతవార్త:**

భూవివాదంలో గుర్తు తెలియని దుండగులను అదుపులోకి తీసుకున్న సంఘటన కొల్లూరు పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గణేస్ పాటిల్ కథనం ప్రకారం.. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూర్ గ్రామంలో సర్వేనంబర్ 192లో 5.12 ఎకరాల భూమిలో కొందరు దుండగులు రాత్రి సమయంలో సెక్యూరిటీ గార్డును కంటెయినర్ గదిలో ముగ్గురిని బంధించి మరో ముగ్గురిని నార్సింగ్‌వరకు తీసుకుపోయి వదిలేశారన్నారు. సదరు భూమిలో ఉన్న ప్రహరీ గోడను, రేకులను తొలగించి పోల్స్‌ను ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న భూయజమాని మాధవి కొల్లూర్ పోలీసులను ఆశ్రయించి సమాచారం తెలుపడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. భూయజమాని మాధవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేష్ పటేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## దేవాలయాలను కాపాడుకోవాలి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రవిప్రసాద్ గౌడ్ తదితరులు

**సికింద్రాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ 2026 సోమనాథ్ ఆలయంపై 1025 జనవరిలో గజనీ మహమ్మద్ దాడి చేసి 2026 నాటికి 1000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 1951లో ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా అమృతోత్సవం పేరుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ జనవరి 11న సోమనాథ్ క్షేత్రంలో సహస్ర సంకల్పయాత్ర ప్రారంభిస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు. నరేంద్ర మోదీ పిలుపుమేరకు ఈరోజు బౌద్ధనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని అంబర్ నగర్ సీతారామాంజనేయ శివపంచాయతన దేవాలయం, బౌద్ధనగర్ శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో గల శివాలయాలలో ఓంకార జపం, అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ దేవాలయాలను మన సొంత ఇంటి కంటే ఎక్కువగా కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్. నేతి సత్యనారాయణ ,కొమరయ్య, నాగరాజ్, భరద్వాజ్.వెంకట చైతన్య, ఒములు, శ్యామ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## సంయుక్త శిష్య బృందంతో కర్ణాటక సంగీత గాన గోష్టి



సంగీత కళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి జనవరి 10 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణ లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో గాన సభ లోని సంగీత నాట్య కళా వేదిక పై గత మూడు రోజులుగా జరుగుతున్న త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత నృత్య కార్యక్రమాలలో భాగంగా శనివారం ప్రముఖ సంగీత గురువు సంయుక్త తన శిష్య బృందం తో కలిసి త్యాగరాజ విరచిత ఎందరో మహానుభావులు , తెరతీయగ రాదా తదితర కీర్తనలు శృతి లయ రాగాల తాళ బద్ధం గా గానం చేశారు ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సంయుక్త గాన సభలో సంగీత గురువు అని తెలిపారు గాన సభ ఉచితం గా శాస్త్రీయ నృత్య సంగీత వేణు వాదన కళా ప్రక్రియల్లో శిక్షణ ఇస్తోంది అని తెలిపారు ఆసక్తి కల వారు ఏ వయస్సు వారైనా గాన సభ లో వివరాలు తెలుసుకోవచ్చు అని చెప్పారు ప్రత్యేక అతిథిగా ప్రముఖ మహిళా సంస్థ అభినందన స్థాపకురాలు భవాని మాట్లాడుతూ గాన సభ త్యాగరాజ స్వామి పేరిట ఏళ్ళ క్రితం నిర్మించటం త్యాగరాజు పట్ల భక్తి కి నిదర్శనమన్నారు.గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.

## నటభూషణ్‌కు నవ రస సినీగీత నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న వంశీ రామరాజు, కొండూరు రవి బాల సుబ్రహ్మణ్యం తదితరులు

**చిక్కడపల్లి జనవరి 10 ప్రభాతవార్త :** నటభూషణ్ బిరుదు గాంచిన శోభన్ బాబుకు సినీ గీతాలతో కొండూరీ భారతి సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై శనివారం స్వర నివాళులు అర్పించారు. సంస్థ స్థాపకుడు కొండూరు రవి సహా గాయకులు రేవతి, అఖిల తదితర గాయకులతో శోభన్ బాబు సినిమా లలోని పాటలు సుమధురంగా గానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ శోభన్ బాబు సహజంగా ఎట్టి సాంస్కృతిక సంస్థలు కార్యక్రమాలకి రారు కానీ తాను పట్టు పట్టి వంశీ సంస్థను ఆయన చేతనే ప్రారంభం చేయించిన సంగతి గుర్తు చేసుకున్నారు.కొండూరు రవి బాల సుబ్రహ్మణ్యం నిర్వహించిన పాడుతా తీయగా కార్యక్రమంలోని గాయకుడు ఆయనకి ఇష్టుడని చెప్పారు. తల్లి పేరు పైన సంస్థను పెట్టి ఎందరో గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నారని అభినందించారు.రవి గాయనీ గాయకులను సత్కరించారు.

## పిల్లలకు మన సంస్కృతి నేర్పించాలి: వల్లీశ్వర్



నృత్యకళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి జనవరి 10 ( ప్రభాతవార్త ) :** పిల్లలకు చదువుతో పాటు మన సంస్కృతిని తెలియచేయడం ఎంతో ముఖ్యమని ప్రముఖ పాత్రికేయులు జి.వల్లీశ్వర్ అన్నారు. శనివారం నల్లకుంట శ్రీ శృంగేరి శంకర మఠం, శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శృంగేరి శంకర మఠం లో శ్రీ వాణి నృత్య నికేతన్ విద్యార్థులచే సంస్థ అధినేత శ్రీ రమ వాణి సుందరి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ప్రముఖ కవి రఘుశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జి వల్లీశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పిల్లలను కళ లను నేర్పిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు .శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి పాలపర్తి సంధ్యారాణి నేతృత్వంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ మన కళ లను,కళా కారులను ప్రోత్సహిస్తున్ననందుకు అభినందించారు. సభలో వివిధ రంగాల ప్రముఖులు విక్రమ్ దాచేపల్లి,వడ్లకొండ వెంకట్రావ్,శ్రీ రమ వాణి సుందరి, అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్య గురువు శ్రీ రమ వాణి సుందరిని,చిన్నారులను ఘనంగా సత్కరించారు. నృత్య కళాకారులు సాయి వర్షిణి, లాస్య,మేఘన, సహస్ర,శివాన్విత, తన్విక, పర్ణిక,యోషికలు అదిగో అల్లదిగో,గరుడ గమన,పూజా నృత్యం, బ్రహ్మమొక్కటే,జతి స్వరం అంశాలపై నయన మనోహరంగా నృత్యాంశాలు ప్రదర్శించారు.



బేగంపేటలో జరిగిన జెఎన్‌యూ నెక్స్ట్ జెన్ సమ్మిట్-2026లో గురునానక్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, షార్క్ ట్యాంక్ ఇండియా విజేత డాక్టర్ హెచ్.ఎస్. సైని, కనికా ఆగర్వాల్, శ్రేయ రావు (మిస్ ఇండియా 2018 రన్నరప్) తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణయం తీసుకోకపోతే నిరాహార దీక్ష

**- 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి**



తమ డిమాండ్లను చూపుతున్న మేచినేని కిషన్‌రావు, దుశ్చర్ల సుదర్శన్‌రావు.

**జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త:** 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి సభ్యులకు పదిహేను రోజుల్లో ప్రభుత్వం న్యాయం చేయకుంటే నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించింది. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు, మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు, సెక్రటరీ జనరల్ దుశ్చర్ల సుదర్శన్‌రావు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంపై స్పందించాలని, ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారులకు ఫించను, ఇళ్ల స్థలాలతోపాటు పలు డిమాండ్ల వియంలో ఇప్పటికే కౌన్సిల్‌లో చర్చించారని, ఇందుకు సంబంధించి కమిటీని వేశారన్నారు. ఆయా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరితగతిన నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో తాము నిరాహారదీక్ష చేపడుతామన్నారు. సెప్టెంబరు 15న ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బీజేపీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రంలో ఉన్న అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నడ్డాలను ఇప్పటికే కలిశామని కంటోన్మెంటలో వంద ఎకరాల్లో స్మృతివనాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతామని హామినిచ్చారన్నారు. ఇప్పటికే చాలా మంది ఉద్యమకారులు ఉచిత బస్సు సౌకర్యం లేక, వైద్య సదుపాయాలు అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాల వల్ల దాదాపు 3000ల మంది ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేసినవారవుతారని వారు వివరించారు.

## మహాత్మా గాంధీ పేరును తొలగించడం దేశ చరిత్రకు అవమానం : కాంగ్రెస్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

**సికింద్రాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అమానుషమైన చర్య అని, ఇది బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న రాజకీయ నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా విమర్శించారు. శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫలమండిలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దీపక్ జాన్, అదం సంతోష్ కుమార్, కోట నీలిమలు మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరు భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా అహింస, సత్యం, శ్రమకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. అలాంటి మహనీయుడి పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం తన గాంధీ వ్యతిరేక భావజాలాన్ని మరోసారి బహిర్గతం చేసిందని ఆరోపించారు. దేశంలో పేదలు, కూలీలు, గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించిన అత్యంత కీలకమైన పథకానికి గాంధీ పేరు జత చేయడం వెనుక లోతైన తత్వం ఉందని వారు గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను వక్రీకరించడం, గాంధీ సిద్ధాంతాలను నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారిందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఇప్పుడు ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగించడం ద్వారా దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిందని, ఇది ప్రజాస్వామ్య దేశంలో ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.మహాత్మా గాంధీ పేరు తొలగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ అంశంపై ఉద్యమాలు, నిరసనలు కొనసాగుతాయని, ప్రజల తరఫున పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, గాంధీ ఆశయాలను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సందీప్ రాజ్, షకిల్ ఖాన్, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, ఘంటా రాజుసాగర్, సురేష్ లాల్, జగ్గు, అనిల్ పాల్గొన్నారు.

## కెటిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త:** కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఖైరతాబాద్ క్రాస్ రోడ్స్‌లో శనివారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశాయి. తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి సైద్ ఖాలిద్ సూచనల మేరకు ఖైరతాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడారం హరిధర్ నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ. హరీశ్‌రెడ్డి, శశి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్.

**జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనగర్‌కాలనీ నుండి అమీర్‌పేట వాల్యూజోన్ వరకు కొనసాగుతున్న రోడ్డు పనులను శనివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పరిశీలించారు. రూ. 50 లక్షలతో ఇక్కడ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : మంత్రి అజారుద్దీన్



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హజారుద్దీన్

**మెహిదీపట్నం, జనవరి 10, ప్రభాతవార్త :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంత్రి హజారుద్దీన్ అన్నారు. టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తో పాటు మంత్రి హజారుద్దీన్ హాజరై మాట్లాడారు..యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితం నాశనం అవుతోందని, వారి వల్ల కుటుంబాలు, సమాజం నష్టపోతుందని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మత్తు రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ముందుగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిపి చంద్రమోహన్, కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఉస్మాన్ బిన్, స్థానిక కాంగ్రెస్ నాయకులు గౌని సంతోష్ గౌడ్, బిజ్జ దుర్గాప్రసాద్, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

### నూతన సీవరేజీ లైన్లు వేయండి

**జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎదురవుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన సీవరేజీ లైన్లు వేయాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్లండ వెంకటేష్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కోరారు. ఇందిరానగర్ స్టేజ్ నుండి పోచమ్మ ఆలయం వరకు, జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 5, ఫిల్మ్‌నగర్ పద్మాలయ అంబేద్కర్ నగర్ బస్తీ, వినాయకనగర్ ప్రధాన దారి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు సత్వరమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరారు.

## జూపార్కు డిప్యూటీ క్యూరేటర్‌గా మురళీధర్



జూపార్కు క్యూరేటర్ జె.వసంతను కలిసి బోకే అందజేస్తున్న డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్

**చార్మినార్,జనవరి 10 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు డిప్యూటీ క్యూరేటర్‌గా జె. మురళీధర్ శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. దాదాపు పద్దెనిమిది నెలలు పాటు జూపార్కు డిప్యూటీ క్యూరేటర్‌గా పని చేసిన ఎం.బర్నోబా డిసెంబరు నెల 31వ తేదీన పదవి విరమణ చేశారు.ఆయన స్థానంలో పిసిసిఎఫ్ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పని చేసిన జె.మురళీధర్ జూపార్కు నాలుగువ డిప్యూటీ క్యూరేటర్‌గా నియమితులయ్యారు. శనివారం జూపార్కు క్యూరేటర్ జె.వసంతను కలిసి బోకే అందజేసిన అనంతరం మురళీధర్ పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్ మాట్లాడుతూ జూ పార్కులోని జంతువుల సంరక్షణ కోసం అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.

### గోనె సాల్మన్‌కు రాజుకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న గోనె సల్మాన్ రాజు,రివర్ సైడ్ లైఫ్ చర్చ్ పాస్టర్లు

**చార్మినార్,జనవరి 10 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తూ క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తున్న గోనె సాల్మన్ రాజుకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలని ఓల్డ్ సిటీ ఏరియా పాస్టర్స్ అధ్యక్షులు జయకుమార్ జక్కయ్యస్ అన్నారు. పాతబస్తీ రివర్ సైడ్ క్రిస్టియన్ లైఫ్ చర్చిలో శనివారం జరిగిన ఓల్డ్ సిటీ ఏరియా పాస్టర్స్ సమావేశంలో గోనె సాల్మన్ పాల్గొన్నారు.క్రిస్టియన్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటంతో పాటు కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్న గోనె సాల్మన్ రాజుకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలని సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఓల్డ్ సిటీ ఏరియా పాస్టర్స్ ఉప అధ్యక్షులు జాన్ మిల్టన్ వినోద్,ప్రధా న కార్యదర్శి రెవరెంట్ బి.సాల్మన్,జాయింట్ సెక్రటరీ అమర్‌నాథ్,కోశాధికారి రెవరెంట్ యేజ్కెల్,సంఘం స భ్యులైన పాస్టర్లు ప్రవీణ్,యోనా, కె.చార్లెస్, ఉపేందర్, జెకర్యా, వెంకటయ్య.అమర్నాథ్,జవహర్‌లాల్,దేవిడ్ పాల్గొన్నారు.

### మహిళకు బెదిరింపు కాల్స్..కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త:** గుర్తుతెలియని వ్యక్తుల నుంచి తనకు బెదిరింపుల కాల్స్ వస్తున్నాయంటూ ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్‌లో నివసించే నిహారిక దువ్వూరి అనే మహిళకు జైటా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులైన అమిత్ ప్రకాశ్, శిల్పా రేవంకర్ తరుపున మాట్లాడుతున్నామంటూ గుర్తుతెలియని నంబర్ల నుండి ఆమెకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఆమె భర్త గతేడాది నవంబరులో ఆ కంపెనీలో రాజీనామా చేశారని, అయితే తప్పుడు ఆరోపణలు అంగీకరించేలా అతనిపై ఒత్తిడి తెచ్చేందుకు అగంతకులు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనికితోడు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని క్రీమ్‌స్టోర్ సమీపంలో ఆమె నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి జైటా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని, లేదంటే తనకు ఇంటి చిరునామా తెలుసంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో తనకు, తన భర్తకు ప్రాణహాని ఉందంటూ ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కళలను భావితరాలకు అందించాలి : మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్




సభలో ప్రసంగిస్తున్న మధుయాష్కీ, వివేకానంద, డా. బి.విజయకుమార్, కె.విజయ్‌భాస్కర్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జనవరి 10 ప్రభాతవార్త :** ప్రపంచవ్యాప్తంగా స్థిరపడ్డ భారతీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను మరువరాదని, వాటిని భావితరాలకు అందజేయాలని టీపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ మాటా 3వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధుయాష్కీ, విశిష్ట అతిథులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద, జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి, సంగీతగురు కె.రామాచారి, జోగిని శ్యామల, లింగా శ్రీనివాస్, మాటా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ కలాల్, ఇండియా కోఆర్డినేటర్ ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డా. బొల్లాం విజయభాస్కర్, మల్లిక్‌రావు, కార్యదర్శి శ్రీధర్ తదితరులతో జ్యోతిప్రకాసనంచేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. దేశ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడానికి మాటా చేస్తున్న ప్రయత్నం హర్షదాయకమన్నారు. మాటా అధ్యక్షుడు కిరణ్ దుగ్గిడి మాట్లాడుతూ మాటా, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంయుక్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉన్నత శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న 600మంది గ్రామీణ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. సభకుముందు మిమిక్రీ శివారెడ్డి, కె.రామాచారి శిష్యబృందం సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకుని అబ్బురపరిచాయి.

## రాజేంద్రనగర్ సర్కిల్‌ను సైబరాబాద్‌లోనే కొనసాగించాలని వినతి



రాజేంద్రనగర్ సర్కిల్‌ను సైబరాబాద్‌లోనే కొనసాగించాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆల్‌పార్టీస్ నాయకులు.

**నార్సింగి, జనవరి 10 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్‌ను హైదరాబాద్‌లో కలుపకూడదని, సైబరాబాద్‌లోనే కొనసాగించాలని కోరుతూ బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ ఆల్ పార్టీస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్, బండ్లగూడ జాగీర్ ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు నేను సిద్ధంగా ఉన్నానని, ఈ విషయంపై ఎవరూ ఆందోళన చెందవద్దని నేతలకు సూచించారు. ఈ ప్రాంత అస్థిత్వానికి భంగం వాటిల్లకుండా, ఇక్కడి రాజకీయ నాయకుల భవిష్యత్తుకు ఇబ్బందులు ఎదురవకుండా చూసే బాధ్యత నాదీ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల వేళ మాత్రమే మనమంతా పార్టీల వారీగా విడిపోయి పోటీలు పడుతామని, ఆ తరువాత అందరం కలిసి అన్నదమ్ముల వలే ఉంటామని తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌ను చార్మినార్ జోన్‌లో కలుపడం వలన మన ప్రాంత ఆదాయం, అస్థిత్వం రెండింటికి ఎసరు వస్తుందని గ్రహించి ఇటీవల నేను స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని ఎమ్మెల్యే తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో రాజేంద్రనగర్‌ను హైదరాబాద్‌లో కలుపకూడదని, సైబరాబాద్‌లోనే ఉంచాలని కోరడం జరిగిందన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని, త్వరలోనే మనందరికి తీపి కబురు వెలువడబోతుందని ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే హామీతో నాయకులంతా కొంత ఊరట చెంది, ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత పూలపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన్నే ఉంటుందని, ప్రజలకు ఇబ్బందికరమైన నిర్ణయాలుంటే వెనక్కి తీసుకొని న్యాయం చేసి తీరుతుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రజల వాయిస్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంతానికి మేలు చేసే ప్రయత్నం చేయడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే కష్టాలను దూరం చేసే పార్టీ అని, మనందరికి మేలు చేసే ప్రకటన త్వరలోనే రాబోతుందన్న ఎమ్మెల్యే మాట నిజమై తీరుతుందని కృష్ణారెడ్డి తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో భీమార్జున్‌రెడ్డి, మాధవరెడ్డి, మహాలింగంగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, సురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, మహేష్ యాదవ్, నాగరాజు, ప్రేమ్‌కుమార్, సదానందం, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల సూచనలు పాటిద్దాం... దొంగతనాలను నివారిద్దాం : ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి

**నార్సింగి, జనవరి 10 ప్రభాతవార్త :** హిందువులు జరుపుకునే అతి పెద్ద పండగలలో సంక్రాంతి పండగ ఒకటి. ఈ పండగను అమ్మా,నాన్న,సోదర,సోదరీమణులు, బంధువులు, స్నేహితులందరి మధ్య ఘనంగా జరుపుకునేందుకు చాలా మంది పట్టణ ప్రజలు గ్రామాలకు తరలి వెళ్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు ఏకంగా వారం,పది రోజుల పాటు తమ ఇళ్లకు తాళాలు వేసి సొంతూళ్లకు వెళ్తుంటారు. ఇదే అదునుగా భావించి దొంగలు తమ చేతులకు పని చెబుతారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి విలువైన, ఆభరణాలు, నగదు, వస్తువులు ఎత్తుకెళ్తుంటారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఉండాలంటే మేము సూచించిన నిబంధనలు పాటించాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఓ కరపత్రంను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పండగకు ఊరెళ్లే ప్రజలు ఇంట్లో విలువైన నగలు, వస్తువులు, నగదు ఉంచకూడదని, వాటిని బ్యాంకు లాకర్లలో పెట్టాలని సూచించారు. బీరువా తాళాలు బెడ్డు కిందగాని, దిండుకిందగాని, బట్టల కిందగాని పెట్టరాదని, ఇంట్లో ఉండే వాహనాలకు తాళాలు వేసి వెంట తీసుకెళ్లాలని తెలిపారు. ఇళ్లకు తాళం వేసి, అది కనిపించకుండా కర్టెన్ వేయాలని, బయటి గదిలో లైట్ వెలిగేలా చూడాలన్నారు. నమ్మకమైన పక్కింటి వారికి తమ ఇంటిపై ఓ కన్నేసి ఉంచమని చెప్పాలని, స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని, రోజూ మొబైల్‌లో మీ ఇంటి పరిసరాలను గమనిస్తుండాలన్నారు. గేటుకు లోపలి నుంచి తాళం వేయాలని సూచించారు.

ప్రయాణ సమయంలో బస్సులో, రైళులో అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలు తీసుకోరాదని, వెంట తీసుకెళ్లే బ్యాగులను మీ దగ్గరే ఉంచుకోవాలని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు తెలిపే సూచనలు పాటించి, దొంగతనాల నివారణలో భాగస్వాములు అవ్వాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

## సైబరాబాద్‌లో ఉంటేనే మెరుగైన భద్రత, వేగవంతమైన అభివృద్ధి సాధ్యం

**-హైదరాబాద్‌లో విలీనం చేస్తే ఉద్యమం తప్పదు : బిజెపి**



**అత్తాపూర్ జనవరి10,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ ,శంషాబాద్ జోన్లను సైబరాబాద్‌లో విలీనం చేయాలని పలువురు బిజెపి నేతలు డిమాండ్ చేశారు.గ్రేటర్ హైదరాబాద్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లను హైదరాబాద్ పరిధిలో కాకుండా సైబరాబాద్ లో విలీనం చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఉప్పర్పల్లి లోని బిజెపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ హాజరై మాట్లాడారు...ప్రస్తుతం రాజేంద్రనగర్ పరిధిలోని సగం ప్రాంతాలు ఇప్పటికే సైబరాబాద్ కమిషనరేట్‌లో ఉన్నాయని, మిగిలిన ప్రాంతాలు మరియు శంషాబాద్ ప్రాంతం హైదరాబాద్ కమిషనరేట్‌లో ఉండటం వల్ల ప్రజలకు అనేక పరిపాలనా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పోలీసింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అనుమతులు, భద్రత వంటి అంశాల్లో స్పష్టత లేకపోవడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.శంషాబాద్ , రాజేంద్రనగర్ పూర్తిగా సైబరాబాద్ పరిధిలోకి వస్తే ఈ ప్రాంతాలకు మెరుగైన భద్రత, వేగవంతమైన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ-గోశామహల్ ప్రభారి వై. శ్రీధర్, చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి, రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి,బుర్ర మహా లింగం గౌడ్,కోరాని సదానంద్,మొండ్రా కోమరయ్య, జోగు రవి,నందకిషోర్, బతుకు శ్రీనివాస్ యాదవ్,భాస్కర్ రెడ్డి ,సోల్కర్ రెడ్డి,జయనంద్ రెడ్డి,రాజీ రెడ్డి,అడికే జనార్ధన్, సాబదా విజయకుమార్,నిఖిల్,సులిగే వెంకటేష్, మహేష్ యాదవ్,సందీప్ ముదిరాజ్,పందు యాదవ్ బొమ్మరాజు నర్సింహ, సీవీ రమణ గుప్తా,సురేష్ ముదిరాజ్,బాబూరావు యాదవ్,వంశీయాదవ్,జే. రామారావు,చంద్రశేఖర్,రాజశేఖర్ రెడ్డి,శివ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

### చేయూత ఫించన్లు పెంచాలని ఆందోళన

**చిక్కడపల్లి జనవరి 10 ( ప్రభాతవార్త ) :** కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన చేయూత ఫించన్లు వృద్ధులకు రూ. 4 వేలు , దివ్యాంగులకు రూ. 6 వేలు లకు పెంచాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఆందోళన చేయాలనీ నిర్ణయించినట్లు డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, వి.భారతి, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్ వివరించారు. శనివారం చిక్కడపల్లి లోని సంస్థ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 21 వ తేదీన ఆయా సమస్యల పరిష్కారం కోసం ఇందిరా పార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నా కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వల్లభనేని ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్.టి. సి. బస్సులో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాలని, వివిధ రకాల స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు రిజర్వేషన్ కేటాయించి అవకాశం కల్పించాలని డిమాండ్ చేసారు.

### వేగంగా ద్విచక్రవాహనం నడిపిన యువకుడు దుర్మరణం
**- మరో ఇద్దరు పాదచారులకు తీవ్ర గాయాలు**

**నార్సింగి, జనవరి 10 ప్రభాతవార్త :** వేగంగా ద్విచక్రవాహనం నడిపిన యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు పాదచారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 9.వ,తేదీ రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో గండిపేట మండలం హైదర్షాకోట్ సన్‌సిటీ వద్ద మెడ్‌లైఫ్ ఆసుపత్రి సమీపంలో మహ్మద్ ఇషాక్(18) అనే యువకుడు వేగంగా జూపిటర్(టిజి07ఎజి9289)ను నడుపుతూ అదుపు తప్పి రోడ్డు దాటుతున్న పాదచారులు వినోద్, షిరాజ్‌ఖాన్‌లను బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇషాక్ తల రోడ్డుకు బలంగా తగులడంతో తీవ్ర రక్తస్రావమై, స్పృహ కోల్పోయాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం పక్కనే ఉన్న మెడ్‌లైఫ్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు స్పష్టం చేశారు. పాదచారులు వినోద్, షిరాజ్‌ఖాన్‌లు సైతం తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ మల్లేష్ వివరించారు.

## సంక్రాంతికి సొంతూరు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి

**- అత్తాపూర్ సిఐ నాగేశ్వర్ రావు సూచన**



**అత్తాపూర్ జనవరి10, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు వెళ్లే వారు తప్పకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అత్తాపూర్ సిఐ నాగేశ్వర్ రావు ప్రజలకు సూచించారు. శనివారం సిఐ నాగేశ్వర్ రావు ప్రభాతవార్తతో మాట్లాడుతూ...సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతర పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని. ముఖ్యంగా నివాస ప్రాంతాలు, నివాస సముదాయాలు మరియు గేటెడ్ కమ్యూనిటీలలో నివసించే వారు అక్కడి భద్రతా సిబ్బంది,వాచ్‌మేన్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లను క్షుణ్ణంగా నిఘా ఉంచాలన్నారు.సీసీటీవీ కెమెరాలు, అలారం వ్యవస్థలు మరియు ఇతర భద్రతా పరికరాలు ఏర్పాటు చేసి, అవి సరిగా పనిచేస్తున్నాయో లేదో నిర్ధారించుకోవాలని ప్రజలు ప్రయాణానికి వెళ్లే ముందు తమ ఇళ్లకు సురక్షితంగా తాళాలు వేసుకోవాలని, విలువైన వస్తువులు, నగదు, బంగారం ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచాలని సూచించారు. అలాగే పొరుగువారికి, సమీప బంధువులకు సమాచారం ఇవ్వడం, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయడం ద్వారా అదనపు భద్రత పొందవచ్చని తెలిపారు. దొంగతనాలను నివారించడానికి పోలీస్ అధికారుల నియమ , నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని అనుమానాస్పద వ్యక్తులు, కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## శివాలయంలో బిజెపి నేతల పూజలు

**వర్గల్, జనవరి 10, ప్రభాతవార్త:**

మండలకేంద్రమైన వర్గల్‌లోని శివాలయంలో బిజెపి మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గజినీమహ్మద్ 1026 సంవత్సరంలో అమర్నాథ్ సోమనాథ్ ఆలయంపై దాడిచేయగా ఈ ఆలయాన్ని పునరుద్ధరించి వెయ్యి సంవత్సరాల నుండి పూజలు అందుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర, జిల్లా పార్టీ పిలుపు మేరకు ఈరోజు శివాలయంలో ఓంకారమంత్రాన్ని పఠించి, అభిషేకం, అర్చనలతోపాటు ప్రత్యేకపూజలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, సీతారాంపల్లి సర్పంచి రామాంజనేయులు, బూత్ అధ్యక్షులు బద్రినాథ్, సుధాకర్‌రెడ్డి, రేణుదాస్, నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**చేర్యాల, జనవరి 10, ప్రభాతవార్త:**

చేర్యాల పట్టణ పద్మశాలిసంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక మార్కండేయస్వామి దేవాలయం ఆవరణంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘసభ్యులు పాల్గొన్నారు.

## కేంద్రనిధులతోనే పట్టణాల అభివృద్ధి

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి**

**హుస్నాబాద్ టౌన్, జనవరి 10, ప్రభాతవార్త:**

కేంద్రప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలోని పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైశ్యభవన్‌లో హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల సమావేశం నిర్వహించగా ఈసమావేశానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు అధ్యక్షత వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో హుస్నాబాద్ మున్సిపల్‌పై బీజేపీ జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు. ఇందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి, పోటీ చేసే అభ్యర్థులకు సహకారంచాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో హుస్నాబాద్ పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దామని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదారించాలని ప్రజలను కోరారు. సమావేశంలో పార్టీనాయకులు వెంకటేష్, నాగార్జున్, రాం ప్రసాద్, లక్ష్మయ్య, అకోజు అరుణ్‌కుమార్, సాయిరామ్, బుర్ర రాజు, అరుణ్‌రెడ్డి, అనంతస్వామితోపాటు తదితరులు ఉన్నారు.

## రజకసంఘం పట్టణాధ్యక్షుడిగా శివగారి అంజయ్య

**చేర్యాల, జనవరి 10, ప్రభాతవార్త:**

చేర్యాల పట్టణ రజక సంఘం పట్టణాధ్యక్షుడిగా శివగారి అంజయ్యను ఆసంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలోని మడేలేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో సంఘసభ్యులు పాల్గొని కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా శెనిగారి రవి, ఉపాధ్యక్షులుగా తుమ్మలపల్లి శ్రీనివాస్, రాచకొండ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల పరశురాములు, శెనిగారి రాజు, కార్యదర్శి బస్వరాజు యాదగిరి, కోశాధికారి బస్వరాజు శ్రీశైలం, శనిగారి విష్ణువర్ధన్, సలహాదారులు మద్దూరి నర్సింలు, గుడ్ల చంద్రం, శెనిగారి మల్లేశం, తుమ్మలపల్లి బాలయ్య, రాచకొండ సత్యం,తుమ్మలపల్లి కిరణ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం శివగారి అంజయ్య మాట్లాడుతూ తనను పట్టణాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రజక సంఘ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే సంఘం అభివృద్ధికి మరింత తోడ్పాటుకు కృషి చేస్తానన్నారు.

## యువత చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలి

**-డిసిసి అధ్యక్షురాలు అంక్షారెడ్డి**




వాలీబాల్ టోర్నమెంట్‌కు జ్యోతిప్రజ్వలన చేస్తున్న అంక్షారెడ్డి

**కొండపాక, జనవరి 10, ప్రభాతవార్త**

యువత చదువుతోపాటు క్రీడల్లోను నైపుణ్యం కలిగి ఉండాలని డిసిసి అధ్యక్షురాలు తూంకుంటా అంక్షారెడ్డి అన్నారు. శనివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గజ్వేల్ డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను అమె ప్రారంభించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం కూడా క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మార్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. క్రీడల్లో నైపుణ్యం కలిగిన వారికి ప్రభుత్వం ఉద్యోగాల్లో అవకాశాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఒ బచ్చలి సత్తయ్య, ఉప సర్పంచ్‌సత్యం, మల్లం ఐలయ్య, ఎన్ఎస్‌వైడిసి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దుబ్బాక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా అభివృద్ధి పనులు

**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, జనవరి 10, ప్రభాతవార్త:**

గ్రామాలు, పట్టణాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ, శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలో 30లక్షల రూపాయలతో చేపట్టనున్న కల్వర్టునిర్మాణ పనులకు, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం గ్రామంలో 20లక్షల రూపాయల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో చేపటనున్న అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, ప్రభాకర్, రమేష్, లక్ష్మణ్, గోపాల్, క్యాసారం సర్పంచ్ సంగీత గోవర్ధన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణతోనే మానవాళికి మనుగడ

**-గజ్వేల్ అటవీ అధికారి పవన్‌కుమార్**

**గజ్వేల్, జనవరి 10, ప్రభాతవార్త:**

అడవుల సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యపడుతుందని గజ్వేల్ అటవీ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. శనివారం అడవుల సంరక్షణపై గజ్వేల్ మండలంలోని కోమటిబండతో పాటు పలు గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై యువత, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అవగాహన కలిగి వుండడంతోపాటు అడవుల సంరక్షణ కోసం సహకరించాలన్నారు. అడవుల్లో సంఘవిద్రోహశక్తుల కార్యకలాపాలకు అవకాశం ఇవ్వవద్దని, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అడవుల్లో మంటలు వ్యాపించకుండా ఫైర్ లైన్‌లు ఏర్పాటు చేస్తుండగా, అగ్ని ప్రమాదాలపై సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతాలపై అటవీ అధికారుల నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. అటవి నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పేదప్రజల కడుపు కొట్టేది అదాని, అంబానీల కడుపు నింపడానికే

**-డిసిసి అధ్యక్షురాలు అంక్షరెడ్డి**




విలేకరులతో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షురాలు అంక్షరెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

పేదప్రజల కడుపుకొట్టి అదాని, అంబానీల కడుపు నింపడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పని చేస్తుందని డిసిసి అధ్యక్షురాలు తూంకుంట అంక్ష రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రరమ్మ, దరిపల్లి చంద్రం, నరకుల్ల శివప్పలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు వారి వారి గ్రామాల్లోనే ఉపాధి కల్పించడానికి ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం పేరు మార్చడం సరికాదని మండిపడ్డారు. స్వంతగ్రామాల్లోనే ఈజీఎస్ ద్వారా నిరుపేదలకు వంద రోజుల పనికల్పించిన ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కుతుందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం పేదప్రజలకు ఎంతోమేలు చేస్తుందని అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి బిజెపిప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఈజీఎస్ పథకంలో మహాత్మాగాంధీ పేరు తీసివేసినంత మాత్రన ప్రజలు గాంధీ పేరు మర్చిపోరని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం పేరు మార్చి విబి జీ రాం జీ పేరు పెట్టడం సరికాదని, ఇందుకు నిరసిస్తూ ఈ నెల 20 నుంచి ఎఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కూలీలలో కలిసి ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం తోపాటు సంతకాల సేకరణ చేపడుతామన్నారు. ఉపాధి హామీ పథకంలో లబ్ది పొందిన ప్రతి రైతు, మహిళ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 9873010606కు మిస్ కాల్ చేసి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రేణుక, మండ పాండు, తిరుపతిరెడ్డి, సతీష్‌గౌడ్, బంక చిరంజీవి, తప్పెట శంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, జనవరి 10, ప్రభాతవార్త:**

మున్సిపల్ పట్టణం లోని ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకల్లో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చాలని ఉద్దేశంలోభాగంగా తెలంగాణ కాంగ్రెస్‌ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఐదు లక్షల చొప్పున అందివ్వడం జరుగుతుందని దానిని అందరూ సద్వినియోగం చేసుకొని ఇళ్లనిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే విజ్ఞప్తిచేశారు. ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాల్లో కృషిచేస్తున్న ప్రభుత్వాధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు హౌసింగ్ శాఖ అధికారులు అందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పట్టణంలోని దర్గా దర్శించుకొని పూజలు చేయడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక పట్టణ ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రభుత్వాధికారులు, హౌసింగ్ అధికారులు పట్టణ పెద్దలు ప్రజలు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చైనా మాంజాను వినియోగించవద్దు

**-గజ్వేల్ సిఐ రవికుమార్**



పతంగుల దుకాణంలో తనిఖీ చేస్తున్న గజ్వేల్ సిఐ రవికుమార్

**గజ్వేల్, జనవరి 10, ప్రభాతవార్త:**

ప్రజల ప్రాణ రక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలకు కారణమవుతున్న చైనా మాంజా వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని గజ్వేల్ సిఐ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట సిపి ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలో ఏర్పాటుచేసిన పతంగుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి చైనా మాంజాను వినియోగించినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని గమనించి తల్లిదండ్రులు పిల్లలు చైనా మాంజా వినియోగానికి దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాల భారిన పడకుండా ప్రాణ భద్రతకు సహకరించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

## జాతీయస్థాయికి ఎంపికైన సింధుజ



సింధుజకు ప్రశంసాపత్రం, మొమెంటోను అందజేస్తున్న అంజిరెడ్డి

**మర్కుక్, జనవరి 10, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని బి.సింధుజ ఇన్స్పైర్ మనక్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైందని మర్కుక్ మండల విద్యాధికారి వెంకటరాములు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన ఇన్స్పైర్ మనక్ అవార్డ్స్, 53వ రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థిని సింధుజ ప్రదర్శించిన వినూత్న వ్యవసాయపరికరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. గైడ్ టీచర్ వై.చిన్నబ్రహ్మయ్య మార్గదర్శకత్వంలో రూపొందించిన ఈ పరికరం విద్యుత్ లేదా బ్యాటరీలు అవసరం లేకుండా చక్రం-ఇరుసు సూత్రం ఆధారంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని సింధుజకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం, మొమెంటోను అందజేసినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి సింధుజను, గైడ్ టీచర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## జిహెచ్ఎంసి డివిజన్‌గా కిష్టారెడ్డిపేట్‌ను ఏర్పాటు చేయాలి

**-మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి**



దీక్ష చేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి, జనవరి 10, ప్రభాతవార్త:**

పరిపాలన వికేంద్రీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నూతన డివిజన్ల విభజనలో అమీన్‌పూర్ మున్సిపాలిటీకి తీవ్ర అన్యాయం జరిగిందని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆరోపించారు. శనివారం కిష్టారెడ్డిపేటలో అఖిలపక్ష బృందం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు ఆయనపాల్గొని పూర్తిమద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ అఖిలపక్ష నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలకు దశలవారీగా పరిష్కారం

**-జనగామ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి**



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

**కొమురవెల్లి, జనవరి 10, ప్రభాతవార్త:**

జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం మండల కేంద్రంలో పర్యటించారు. కొమురవెల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అలాగే వివిధ సంస్థలు, సంఘాలు, ట్రస్టులకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గొల్లపల్లి పద్మ అంజనేయులు, వార్డు సభ్యులతో కలిసి గ్రామంలో పర్యటించి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామంలో సమస్యలను దశల వారిగా పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా డిసిసి అధ్యక్షురాలిని కలిసిన యూత్ నాయకులు

**చేర్యాల, జనవరి 10, ప్రభాతవార్త:**

జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేర్యాలలో ఈనెల 12,13,14 తేదీలల్లో జరిగే వాలీ బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ యూత్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షురాలు తూముకుంట ఆంక్షరెడ్డిని యూత్ నాయకులు కలిసి ముఖ్యతిథిగా ఈ కార్యక్రమానికి రావాలని కోరారు.జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కర్క సంతోష్ రెడ్డి,చేర్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమని బాలరాజు,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో కన్వీనర్ మెడిచెల్మి రాకేష్,మండల యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా అధ్యక్షులు అనుముల రాజశేఖర్ రెడ్డి,చేర్యాల మండల యూత్ కాంగ్రెస్ నాయకులు జంగిటి వేణు ఉన్నారు.

## ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి

**-మండల వ్యవసాయాధికారి వసంతరావు**

**జగదేవ్‌పూర్, జనవరి 10, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని రైతులందరూ ఈ-ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు సూచించారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్, వట్టిపల్లి గ్రామాల్లో రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలు పొందడానికి ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ నెంబర్ తప్పనిసరి అవుతుందని తెలిపారు. ఇప్పటివరకు నమోదుచేసుకోని రైతులకు వారి చరవాణికి మెసేజ్ పంపించడం జరిగిందని, కావున మండలంలో ఇప్పటివరకు నమోదు కాని రైతులు అందరూ తమ సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి వద్ద లేదా మీసేవ కేంద్రాల్లో రూ.15 చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ పోసానిపల్లి రాజు, ఉపసర్పంచ్ తలకొక్కల శ్రీశైలం, రైతులు అక్కరాజు రాజయ్య, వడ్లకొండ మహేష్, కొంతం కృష్ణంరాజు, వీరబత్తిని రామకృష్ణ, పెద్దులు, వ్యవసాయ విస్తరణాధికారులు కిరణ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జిఎంఆర్‌ను కలిసిన పటాన్‌చెరు తహసీల్దార్

**పటాన్‌చెరు, జనవరి 10, ప్రభాతవార్త:**

పటాన్‌చెరు మండల తహశీల్దారుగా బదిలీపై వచ్చిన హరిబాబు శనివారం పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు.

## నిషేధిత చైనా మాంజా స్వాధీనం

**-ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు**



చైనా మాంజా స్వాధీనం చేసుకున్న పోలీసులు

**సిద్దిపేట అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలో నిషేధిత చైనా మాంజాను అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు శనివారం దుకాణంపై దాడి నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా సుమారు 35 చైనా మాంజా రోల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత చైనా మాంజా అమ్ముతున్న అగమాలు రాజేష్ అలియాస్ చింటూ, మహేశ్వరం నాగరాజు, సుతారి శేఖర్‌లు ఉన్నారని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు. రాజేష్, నాగరాజులను అరెస్టు చేయగా సుతారీ శేఖర్ పరారీలో ఉన్నారని తెలిపారు. చైనా మాంజాను అమ్మిన వినియోగించిన చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యావరణానికి,ప్రాణాలకు హానీ కలిగించని సాధారణ దారాన్ని మాత్రమే వినియోగించాలన్నారు.

## రోడ్డు నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

**గజ్వేల్ టౌన్, జనవరి 10, ప్రభాతవార్త:**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో శనివారం ఆటో డ్రైవర్లకు గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో, ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో ఇష్టం వచ్చినట్లు ఆటోలను నిలుపవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా యూనిఫామ్ ధరించాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఆటోలలో డిజె బాక్సులు పెట్టి ప్రయాణీకులను ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలు నడపవద్దని, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ తప్పకుండా వెంబడి ఉంచుకోవాలన్నారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ క్రమశిక్షణతో ఆటోను నడిపి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆటోలో ఎక్కే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై, మద్యం సేవించి ఆటోలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మత్తుపదార్థాల నివారణలో భాగంగా స్పెషల్ టీం తనిఖీలు



దుకాణాల్లో డ్రగ్స్ కార్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**వెల్దుర్తి, జనవరి 9, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం నాడు మత్తు పదార్థాల నివారణలో భాగంగా మెదక్ నుండి స్పెషల్ టీం వచ్చి వెల్దుర్తి పోలీస్ స్టేషన్ స్థానిక పోలీస్ తో కలిసి వెల్దుర్తి గ్రామంలోని అనుమానిత ప్రాంతాల్లో మత్తు పదార్థాలను తనిఖీలు చేయడం జరిగింది. మత్తు పదార్థాల విక్రయాల అడ్డుకట్టే లక్ష్యంగా వెల్దుర్తి పోలీసులు బ్యాగ్స్ కాదు స్పెషల్ టీం సిబ్బంది రవీందర్ ఆధ్వర్యంలో స్థానిక కిరాణా. పాన్ షాపుల్లో క్షుణ్ణంగా హోదాలు చేశారు. నిషేధిత పదార్థాల నిలువలు. అక్రమ అమ్మకాలపై. ఆరా తీశారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

**-మర్కుక్ ఎస్ఐ దామోదర్**

**మర్కుక్, జనవరి 10, ప్రభాతవార్త:**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గాలిపటాలు ఎగరవేసేందుకు గానూ ఎవరైనా చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో గల దుకాణదారులు ఎవరైనా ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. మండల ప్రజలు అందరూ ప్రశాంత వాతావరణంలో భోగి, సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా చైనా మాంజాను అమ్మినట్లయితే 9712667341 నెంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ సర్పంచ్‌లకు సన్మానం..

**చిలిపిచెడ్, జనవరి 10, ప్రభాతవార్త:**

మండలంలోని ఎస్సీ, ఎస్టీ సర్పంచులను మన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకయ్య ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ సర్పంచులకు సన్మాన కార్యక్రమాన్ని తునికి నల్ల పోచమ్మ ఆలయ పరిధిలో ఏర్పాటు చేసి సర్పంచుల సన్మాన కార్యక్రమంలో నూతన సర్పంచులకు పలు సూచనలు చేసి చట్టపరమైన విధి విధానాలను నూతన సర్పంచులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచులు బేగరి యశోద బిక్షపతి, తలారి రాములు, ఆర్ కున్య, నీలి పాండు, ఆనంద్, మోనిక గణేష్, సుజాత మాంజా, వద్దులే దురియ, జీవుల ఎస్సీ ఎస్టీ సర్పంచులు వార్డ్ మెంబర్లు ఉప సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజ వాడితే కఠిన చర్యలు తప్పవు

**-సిఐ, ఎస్ఐలతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించిన డిఎస్పి**




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్పి సైదా నాయక్

**జహీరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:**

సంక్రాంతి పండగను పురష్కరించుకుని గాలిపటాలు ఎగరేసేందుకు, తోటి పతంగులతో పేంచీ పడేందుకు చైనా మాంజను వినియోగిస్తే చర్యలు తప్పవని డిఎస్పి సైదా నాయక్ హెచ్చరించారు. శనివారం ఫారెస్ట్ శాఖ చైనా మాంజపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించేందుకు రూపొందించిన పోస్టర్‌ను పట్టణ సిఐ శివలింగం, ఎస్ఐ కే వినయ్‌కుమార్‌లతో కలిసి డిఎస్పి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ చైనా మాంజను అమ్మినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా, పతంగులు ఎగరేసినా కఠిన చర్యలు తప్పవని డివిజన్ ప్రజలకు హెచ్చరించారు.

## ముక్తాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుభాష్ చంద్రబోస్

**నాగల్‌గిద్ద, జనవరి 10, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ముక్తాపూర్‌లో సంక్రాంతి సెలవులను పురష్కరించుకుని స్వామి వివేకానం యత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రికెట్ టౌర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ సుభాష్ చంద్రబోస్ యువత కేరింతలు కొడుతుండగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, క్రీడాకారులు, యవకులు పాల్గొన్నారు.

## జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సింగిరాంరెడ్డి..

**మనోహరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:**

ఉపసర్పంచుల హక్కులను కాపాడేందుకు సంఘం తరపున కృషి చేస్తానని రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు లావుడ్య రాములు నాయక్ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ ఉపసర్పంచి సింగి రాంరెడ్డిని జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా నియమిస్తూ నియామకపత్రం ఆయన అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపసర్పంచుల పాత్ర కీలకం అని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఉపసర్పంచుల తరపున నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు రేణుకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామిని దర్శించుకున్న చంద్రశేఖర్‌రెడ్డి

**మనూర్, జనవరి 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని దవ్వూర్ లొంక హనుమాన్ ఆలయంలో కొలువుండి భక్తులచే నిత్య పూజలందుకుంటున్న లొంక ఆంజనేయస్వామిని శనివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ఆలయ అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్ర శేఖర్‌రెడ్డికి ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయానికి చేరుకున్న చంద్రశేఖర్‌రెడ్డిని సర్పంచి సుక్కుబాయి రవి శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు, మాజీ సర్పంచులు అనిల్‌పాటిల్, గుండురావుపాటిల్, ప్రభాకర్‌రెడ్డి, బస్వరాజ్, బి.రాజు, శంకర్ తదితరులు ఉన్నారు.

## బొమ్మారెడ్డిగూడెం విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో కాంస్యపతకం

**-అభినందనలు అందుకున్న క్రీడాకారులు**



కాంస్య పతకం సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

**చౌటకూరు, జనవరి 10, ప్రభాతవార్త:**
రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి కాంస్య పతకంను దక్కించుకున్నారు. ఈ నెల 7వ తారీఖు నుంచి 9వ తేదీ వరకు ములుగు జిల్లాఏటూరు నాగరంలో గిరిజన శాఖ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రత్యర్థి జట్టును మట్టికరపించి ప్రథమస్థానం పొంది కాంస్య పతకం, ప్రశాంసా పత్రాలు అందుకున్నారు. కాంస్య పతకంలో పాఠశాలకు చేరుకున్న విద్యార్థులకు శనివారం పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ జైపాల్‌నాయక్, వసతి గృహం మెట్రిన్ భవానిలు శాలువాలతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి డైరెక్టర్ రాములు వార్డు సభ్యులు సుభాష్, గోపాల్, కార్బారీ రవీందర్, పాఠశాల సిబ్బంది బాబ్య, మురళీగౌడ్, ఆంజనేయులు, అనురాధ, విగ్నేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్



మాయికోడ్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్థులు

**మనూర్, జనవరి 10, ప్రభాతవార్త:**
సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని మండల పరిధిలోని మాయి కోడ్, రాయిపల్లి గ్రామాల్లో క్రికెట్ టోర్నమెంట్ శనివారం యువత కేరింతల మధ్య ప్రారంభం అయ్యింది. మాయికోడ్ గ్రామంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభం అయిన టోర్నమెంట్‌లో గ్రామ సర్పంచి కర్ణం కృష్ణ టోర్నీని ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచి కర్ణం కృష్ణ మాట్లాడుతూ ప్రతి యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలతో కలిగే ప్రయోజనాలపై క్రీడాకారులకు వివరించారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఉదయం మనూర్, బెల్లాపూర్ జట్లు, మధ్యాహ్నం వనంపల్లి తండా, బెల్లాపూర్ గ్రామాల జట్లు పోటీపడ్డాయి. కార్యక్రమంలో గ్రామస్థులు సుధాకర్, బిరాదర్ నగేష్, విజయ్ కుమార్, వామన్‌రావు, శివాజీరావు, శివకుమార్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సమాజం క్యాలెండర్ ఆవిష్కరణ



బ్రాహ్మణ సమాజం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు

**న్యాల్‌కల్, జనవరి 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో శనివారం బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ నూతన ఆంగ్ల సంవత్సరం 2026క్యాలెండర్‌ను సంఘం మండల అధ్యక్షులు జగదంబరావు కులకర్ణి సంఘం బాధ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదంబరావు కులకర్ణి మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని, అందుకు సేవా సంస్థ అండగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో రోజులు గడిపితే ప్రశాంతత దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ కార్యదర్శి మోహన్‌రావు జ్యోషి, మాజీ అధ్యక్షులు సతీష్‌కుమార్ కులకర్ణి, కమిటీ బాధ్యులు బడశేషి శ్రీధర్‌రావు కుల్‌కర్ణి, పవన్ కులకర్ణి, బలవంతరావు, మహిళా కమిటీ బాధ్యులు జయబాయి కులకర్ణి, మేఘా కులకర్ణి, మీనా జ్యోషిలు పాల్గొన్నారు.

## పేరుకు మండల కేంద్రం-పరిసరాలన్నీ అపరిశుభ్రం

**-కొత్త పంచాయతీ పాలకులు పట్టించుకోరా?**



న్యాల్‌కల్‌లో మురుగుకాల్వల్లో పేరుకుపోయిన దుర్గంధం

**న్యాల్‌కల్, జనవరి 10, ప్రభాతవార్త:**
పేరుకు అది మండలకేంద్రం. పరిసరాలన్నీ అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండల కేంద్రమైన న్యాల్‌కల్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఇన్నాళ్లు పాలకులు లేక వీధులను శుభ్రంచేయించేవారు లేక పరిసరాలన్నీ అపరి శుభ్రంగా మారడంతో ప్రజలు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. గ్రామం లోని మురుగు కాల్వలను శుభ్రంచేసేవారు కరువవడంతో అటుగా వెళ్లే వారు ముక్కును మూసుకుని నడవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గం ఉండటంతో గ్రామస్థులు గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చొరవ తీసుకోవాలని పాలకవర్గానికి సూచిస్తున్నారు. గ్రామ సర్పంచి, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకుని గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచి జ్యోతిలక్ష్మి ప్రవీణ్‌కుమార్ గ్రామ పరిశుభ్రతకై ఏ మేరకు స్పందిస్తారో వేచి చూద్దాం...

# సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ క్రీడలు

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



క్రీడలను ప్రారంభిస్తున్న శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి

**గుమ్మడిదల, జనవరి 10, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఓపెన్ టు ఆల్ కబడ్డీ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ క్రీడాపోటీలను పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభిం చారు. ఈకార్యక్రమంలో ఆయన యువతను ఉద్దే శించి మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి, మద్య పానం వంటి దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని సూచించారు. శారీరక, మానసిక ఉల్లా సం కోసం ప్రతి యువకుడు తనకు నచ్చిన క్రీడలో పాల్గొని ప్రతిభను కనబరచాలని కోరారు. క్రీడలు క్రమశిక్షణ, నాయకత్వ గుణాలు పెంపొందించ డంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. స్వామి వివేకానంద బోధనలు యువతకు మార్గదర్శకమని పేర్కొంటూ, ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, చెడు వ్యసనాలకు బానిసలుకాకుండా ఉండాలని, క్రీడల ద్వారా మానసికోల్లాసం, ఆరోగ్యకరజీవనం, మనో ధైర్యం, స్నేహభావం పెరుగుతాయని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అధికారి రిషిపాల్, సిఐ రమణారెడ్డి, ఎస్సై లక్ష్మి కాంత్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి కుమార్‌గౌడ్, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, రాజేష్, హు స్సేన్, నరసింహారెడ్డి, కొమ్ము శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, రాజశేఖర్, మురళి, దేవేందర్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, మొగు లయ్య, సదానందరెడ్డి, సత్యనారాయణ, మోహన్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, వాసుదేవరెడ్డి, నరహరి, ఆం జనేయులు, గోపాల్, రుక్మారెడ్డి, అశోక్, మురళి, రాజు, ఎ.కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, కులసంఘాల నా యకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రీడలకు కాంగ్రెస్ సర్కార్ పెద్ద పీట వేస్తుంది

**-దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**తొగుట, జనవరి 10, ప్రభాతవార్త:**
క్రీడలకు కాంగ్రెస్ సర్కార్ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగాపూర్ సర్పంచి గాంధారి లతానరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వ హించిన క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ అలవాటు పడుతుందన్నారు. టోర్నమెంట్‌లో మొదటిబహుమతిగా రూ.20వేలు, ద్వితీయబహుమతిగా రూ.10వేలు ప్రక టించారు. టోర్నమెంట్‌లో 50జట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిమ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, యువ కులు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్‌కు ఘనస్వాగతం

**-రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలపై దిశానిర్దేశాలు**

**గుమ్మడిదల, జనవరి 10, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయంలో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డిని మున్సిపల్ కమిషనర్ దశరథ్‌తోపాటు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, పూలబొకే అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. ఈసమావేశంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్ గుమ్మడిదల మున్సి పాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి తదితర అం శాలపై ఎమ్మెల్యేకు సమగ్రంగా వివరించారు. అలాగే రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల నిర్వహణకు సంబం ధించి అధికార యంత్రాంగం సిద్ధత, ఓటర్ల అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి అందరూ కలిసికట్టుగాపనిచేయాలని కోరారు. కార్యక్రమంలో అధికా రులు ప్రభాకర్, రాములు, సంగీత, మున్సిపల్‌సిబ్బంది, నాయకులు గోవర్ధన్ రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, మమ్మద్ హుస్సేన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## పోటీలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**-జిల్లా స్పోర్ట్స్ యువజన విభాగం అధికారి జంగపల్లి వెంకట నరసయ్య**




ధూళిమిట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**ధూళిమిట్ట, జనవరి 10, ప్రభాతవార్త:**
ఈనెల 18 నుండి జరగబోయే సిఎం కప్ క్రీడల్లో పాల్గొనే యువతీ యువకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా స్పోర్ట్స్ యువజన విభాగం అధికారి జంగపల్లి వెంకట నరసయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సిఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని యువతీయువకులు క్రీడాపోటీల్లో పాల్గొనాలంటే రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ ఎస్ఐ ఆసిఫ్, ధూళిమిట్ట, మద్దూర్ మండల ఇంచార్జి ఎంపివోలు మాధవ్ జాదవ్, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు సిద్దేశ్వర్, రాజు, నోముల కిరణ్, ధూళిమిట్ట పాలకవర్గం సభ్యులు, క్రీడాకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

**గుమ్మడిదల, జనవరి 10, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలంలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యవసాయ అధికారి కె.శివప్రసాద్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన వ్యవసాయ అధికారులు రైతులతో మాట్లాడి, ఫార్మర్ రిజి స్ట్రేషన్ ప్రాముఖ్యతను వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ పథకాలు పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రే షన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఇందుకోసం భూమి ఉన్న ప్రతి రైతు తమ ఆధార్‌కార్డు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకుని తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వద్దకు లేదా సమీప మీసేవా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గుమ్మడిదల రైతు వేదిక తోపాటు నల్లవల్లి గ్రామాలలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి స్వయంగా పరిశీలించారు. కార్య క్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు జి.నిఖిత, ఆర్.ఆస్మితతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## వార్డుల విభజనను పునఃపరిశీలించండి



కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకుల దృశ్యం

**గుమ్మడిదల, జనవరి 10, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల చేపట్టిన వార్డుల విభజన పూర్తిగా తారుమారుగా ఉందని, దీనివల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని స్థానిక నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ దశరథంను కలిసి నాయకులు విస్తృతంగా చర్చించి, వార్డుల పునర్విభజనతోపాటు ప్రస్తుతం ఉన్న 22వార్డుల సంఖ్యను పెంచా లని అధికారికంగా డిమాండ్‌చేశారు. ప్రస్తుత వార్డులవిభజన జనాభా ప్రమా ణాలు, భౌగోళిక పరిస్థితులు, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకో కుండా చేసినట్టుగా ఉందని నాయకులు తెలిపారు. అలాగే గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, వీరన్నగూడెం, అన్నారం తదితర ప్రాంతాల కాలనీ లు, గ్రామాలు చీలిపోయేలా వార్డుల విభజన జరగడంతో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల అమలులో ఓటర్లు ఒక వార్డు నుంచి మరో వార్డు కు మార్చడం గందరగోళం ఏర్పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ దశరథం మాట్లాడుతూ, నాయకులు లేవనెత్తిన అంశాలను గమ నించామని, నిబంధనల ప్రకారం ఈవిషయాన్ని పై అధికారుల దృష్టికి తీసు కెళ్లి, పరిశీలించి తగినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి కుమార్‌గౌడ్, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, అభిశెట్టి రాజశేఖర్, మంగయ్య, గణేష్, గటాడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

**-జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి**

**సిద్దిపేట అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త:**
రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి స్వరూపరాణి సూచించారు. మండలపరిధిలోని ఎన్సాన్ పల్లిలో శనివారం నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిఎం కిసాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలకు అవరోధం ఏర్పడుతుందని తక్షణమే వ్యవసాయ విస్తరణాధికారి లేదా మీసేవాకేంద్రాలలో రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణాధికారి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పాం ఫ్యాక్టరీనా..? బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయమా..?

**-టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి**



హరీష్‌రావు ఫ్లెక్సీని దగ్ధంచేస్తున్న దృశ్యం

**నంగునూర్, జనవరి 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నర్మెట గ్రామంలో నిర్మిం చింది ఆయిల్‌పాం ఫ్యాక్టరీనా లేక బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయమా అని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ప్రశ్నించారు. ఆయిల్‌పాం ఫ్యాక్టరీని సందర్శించి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఫ్లెక్సీని శనివారం మండల కేంద్రంలో దగ్ధం చేసి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ఫ్యాక్టరీని ప్రారంభిస్తే బిఆర్‌ఎస్ పార్టీకి హరీష్‌రావుకు పుట్టగతులుండవనే భయంతో సిద్ది పేట జిల్లాను రద్దు చేస్తారని తప్పుడు ఆరోపణలతో విషం వెళ్ళగక్కారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఫ్యాక్టరీ పనులు ముమ్మరంచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారే తప్ప, బిఆర్‌ఎస్ పాలనలో ఒరగబెట్టిం దేమిలేదన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగు లతో చెలగాటం ఆడింది మీరు కాదా? అని ప్రశ్నిం చారు. ప్రభుత్వం నిర్మించిన ఫ్యాక్టరీలో ప్రెస్‌మీట్ పెట్టి రాజకీయాలు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని తిడితే, సంబంధిత అధికారుల మీద, హరీష్‌రావు మీద క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచులు, పార్టీ నాయకులు ముక్కెర లింగంయాదవ్, ఎనగందుల యాదగిరి, అచ్చిన సత్తయ్య, ఎనగందుల నితిన్ కుమార్, చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, గౌరబోయిన సంపత్, జంగిటి శ్రీనివాస్, రాగుల కృష్ణ, జెల్ల పోచయ్య, తుపాకుల శ్రీనివాస్, విక్రమ్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బడే సాంబయ్య, మైసయ్య, చందుపాషాలు పాల్గొన్నారు.

## పేదల పొట్టగొట్టడమే వికసిత్ భారత్ ఉద్దేశ్యమా?

**-రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు**

**చౌటకూరు, జనవరి 10, ప్రభాతవార్త:**
కేంద్రప్రభుత్వం అంబానీ, ఆదానీల కోసం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామి చట్టాన్ని మార్పులు చేసిందని రైతుసంఘం జిల్లా ఉపాధ్య క్షులు గొల్లపల్లి జయరాజు విమర్శించారు. శనివారం జయరాజు మాట్లా డుతూ పెట్టుబడిదారీ కంపెనీలకు కారుచౌకగా కూలీలను పంపేందుకే కేంద్రప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశ వ్యాప్తంగా ఉధృతంగా పోరాటాలు నిర్వహించి కేంద్రప్రభుత్వ విధానా లను తిప్పికొడతామని హెచ్చరించారు. కార్మికులు, కర్షకులు, పేద లందరూ ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు భూషణం, రైతు సంఘం నాయకులు జైపాల్‌రెడ్డి, కార్మికులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా అమ్మితే చర్యలు తప్పవు

**-మండల ప్రజలకు ఎస్ఐ రవిగౌడ్ హెచ్చరిక**

**కల్హేర్, జనవరి 10, ప్రభాతవార్త:**
సంక్రాంతిని పురస్కరించుకుని గాలిపటాలు ఎగరేసేవారు చైనా మాంజాను, గాంజీపూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలు వినియో గిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రవిగౌడ్ హెచ్చరించారు. గ్రామాల్లో చైనా మాంజీ అమ్మినా, నిల్వచేసినా, రవాణాచేసినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో చైనా మాంజా అమ్మినా, వినియో గించినా పోలీసు ఠాణాకు సమాచారం అందించాలని, లేదా 100కు కాల్ చేయాలని ఎస్ఐ రవిగౌడ్ సూచించారు.

## వంగ్దాల్ సర్పంచిని సన్మానించిన ఎమ్మెల్సీ



సర్పంచి బేగరి పాండును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**సిర్గాపూర్, జనవరి 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వంగ్దాల్ గ్రామ సర్పంచి బేగరి పాండు, ఉప సర్పంచి నాగప్పలను పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిలు శనివారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. గ్రామస్థుల కలలు నెరవేరేలా గ్రామాభావృద్ధికి పాటుపడాలని అంజిరెడ్డి, గోదావరిలు సూచించారు. గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని సర్పంచి, ఉప సర్పంచిలు వేడుకోగా గ్రామానికి త్వరలోనే చేరుకుని తమవంతు సహ కారం అందచేస్తామని హామీచేసినట్లు సర్పంచి బేగరి పాండు పేర్కొ న్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, మండల అధ్యక్షులు శంకర్‌పాటిల్, నాయకులు శ్రీకాంత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త:**
వాసవి క్లబ్స్, అంబిటస్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, తెలంగాణరాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళావిభాగం కార్యదర్శి మాంకా ల నాగరాణిలు వ్యవహరించారు. వాసవిక్లబ్స్ ఇంటర్నేషనల్ నాయ కులు గంప శ్రీనివాస్, కోర్తివాడ రాజేందర్, డాక్టర్ మాంకాల నవీన్ కుమార్, అంబిటస్ స్కూల్ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం ముగ్గుల పోటీలో ప్రథమబహుమతి పొందిన రవళి, ద్వితీయబహుమతి సుజాత, తృతీయబహుమతి భాగ్యలక్ష్మీలకు బహుమతులు అందించారు. అలాగే మరో 5గురికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్స్ ప్రతినిధులు శ్రీనివాస్, ఉమారాణి, శివ, నేతి వేణుకుమార్, గంప కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, పుల్లూరు శశాంక్, పుల్లూరు శ్రీనివాస్, రవి, సంధ్య, కైలాసం, హరికిరణ్, సంతోష్‌లు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త:**
జిల్లా నుంచి జాతీయ స్థాయికి మూడు ప్రదర్శనలు, దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలకు రెండు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. కామారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి 53వ రాజ్యస్థరియబాల్ వైజ్ఞానిక్ ప్రదర్శన 2025-26 ఇన్‌స్పైర్ మనక్ 2024 ప్రదర్శనలో జిల్లా నుంచి 19 ఇన్‌స్పైర్ ప్రదర్శనలను, 14 సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలను ఒకటి టీచర్ ఎగ్జిబిట్‌లో పాల్గొనడం జరిగింది. దామరకుంట ఉన్నత పాఠశాల విద్యార్థి సింధూజ గైడ్ టీచర్ చిన్న బ్రహ్మయ్య సారథ్యంలో ఉన్నత పాఠశాల అహమ్మదిపూర్ విద్యార్థి భానుప్రసాద్, గైడ్ టీచర్ హఫీస్ సారథ్యంలో, ఉన్నత పాఠశాల జాలిగామా విద్యార్థి సలోమినాయక్ గైడర్ టీచర్ నర్సింలు సారథ్యంలోని ప్రదర్శనలు జాతీయస్థాయికి ఎన్నికయ్యారు. దక్షిణభారత వైజ్ఞానికప్రదర్శనకు ఉన్నతపాఠశాల బేగం పేటకు చెందిన ధార ప్రభాకర్ రూపొందించిన టీచర్ ఎగ్జిబిట్, ఉన్నత పాఠశాల రాయపోల్ విద్యార్థి నిశాంత్‌రెడ్డి, గైడ్ టీచర్ స్వామి సారథ్యంలో రూపొందించిన ప్రదర్శనలు ఎన్నికయ్యాయి. జాతీయ స్థాయి, దక్షిణభారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎన్నికైన విద్యార్థులను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రశంస పత్రాలు అందజేసి మొమెంటోలతో సత్కరించారు. దక్షిణభారత వైజ్ఞా నిక ప్రదర్శనకు ఎన్నికైన విద్యార్థులను డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ అభినందించారు.

## రైతులకు యూరియా కార్డుల పంపిణీ

**కొమురవెల్లి, జనవరి 10, ప్రభాతవార్త:**
రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండాలనేలక్ష్యంతో ప్రభుత్వం యూరియాకార్డుల పంపి ణీ చేపట్టిందని మండల వ్యవసాయ విస్తరణాధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలపరిధిలోని మర్రిముస్త్యాలగ్రామంలో రైతు లకు యూరియాకార్డులు పంపిణీచేసి మాట్లాడారు. రైతులు తమ పొలాల వివరాలను నమోదు చేసుకొని ఎలాంటి మధ్యవర్తులు లేకుండా ఎరువులు పొందేలా ఈవిధానం ఉపయోగపడుతుందన్నారు. కార్య క్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి, రవళి, రైతులు పాల్గొన్నారు.